అభివృద్ధి పేరుతో..దళితులకు అన్యాయం

మణికొండ, డిసెంబర్ 4: అభివృద్ధి పేరుతో పేద దళితుల భూములు తీసుకోవద్దని కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్, సీపీఎం కార్యదర్శి జాజాల రుద్రకుమార్‌లు అన్నారు. నార్సింగి మున్సిపలిటీ వట్టినాగులపల్లిలో సర్వే నెంబర్ 132లోని దళితుల భూమిని బుధవారం వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా దళితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు తరాలుగా ఈ భూమిని వ్యవసాయం చేసుకొని దళితులు జీవనం సాగిస్తున్నారన్నారు. 52 ఎకరాల ఈ భూమిని దళితులకు ఇందిరాగాంధీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. హౌసింగ్ బోర్డు సొసైటీ వారు 2007లో తమకు కేటాయించారని ఇప్పుడు రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ భూమి జోలికి వస్తే దళితులందరిని ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో భూములు తీసుకోవాలని చూడడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా నాయకులు బచ్చలకూర స్వామి, రాజు, స్వామి పాల్గొన్నారు.

వట్టినాగులపల్లిలోని దళితుల స్థలాన్ని పరిశీలిస్తున్న కేవీపీఎస్, సీపీఎం నాయకులు

రేపటి నుంచి యూరోపియన్ యూనియన్ ఫిలిం ఫెస్టివల్

-ప్రసాద్ ఫిలిం ల్యాబ్స్‌లో సినిమాల ప్రదర్శన

బంజారాహిల్స్,డిసెంబర్ 4: ప్రతిష్టాత్మక యూరోపియన్ యూనియన్ ఫిలిం ఫెస్టివల్(ఈయూఎఫ్ఎఫ్) 29వ ఎడిషన్ హైదరాబాద్‌లో ఈ నెల 6నుంచి 15వరకు బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ఫిలిం ల్యాబ్స్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సారథి స్టూడియోస్- హైదరాబాద్ ఫిలిం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఫిలిం ఫెస్టివల్‌లో వివిధ దేశాలకు చెందిన 31 భాషల్లోని సినిమాలను ప్రదర్శించనున్నారు. బెల్జియం, బల్గేరియా,సైప్రస్, చెకియా, డెన్మార్క్, ఎస్టోనియా, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, హంగేరీ, ఐర్లాండ్, ఇటలీ, లాత్వియా, లిథువేనియా, పోలండ్ తదితర అనేక యూరోపియన్ దేశాలకు చెందిన సినిమాలు నగరంలోని సినీ ప్రేమికులను అలరించనున్నాయి. లా చిమెరా, బాన్, జిమ్స్ స్టోరీ, అఫైర్, వాట్ ఏ ఫీలింగ్, యానిమల్,యాన్ ఐరిష్ గుడ్‌బై, రీస్టార్ పాయింట్,ది మ్యాన్ విత్తౌట్ గిల్ట్ . ది టీచర్ హు ప్రామిస్డ్ ది సీ తదితర సినిమాలు ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.

బస్తీ దవాఖానల్లో రిజిస్టర్ల తనిఖీ

యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానను సందర్శించి రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ హేమలత

జూబ్లీహిల్స్,అక్టోబర్ 4 : బస్తీ దవాఖానల్లో అందుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అమీర్‌పేట్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ హేమలత పేర్కొన్నారు. బస్తీ దవాఖానలో అన్ని పరీక్షలు ఉచితంగా చేపడుతూ నాణ్యమైన మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానను సందర్శించి రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్మయి శ్రీరంగా, స్టాఫ్ నర్స్ ఉమారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది..నయవంచన పాలన

-బీజేపీ ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి

బంజారాహిల్స్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి

బంజారాహిల్స్,డిసెంబర్ 4: తెలంగాణ రాష్ట్రంలో ఏడాది కాలంగా ప్రజలను అన్ని రకాలుగా మోసాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకోవాల్సింది ప్రజా పాలన ఉత్సవాలు కాదని, కాంగ్రెస్ పార్టీ నయవంచన ఉత్సవాలు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏడాది కాంగ్రెస్ పాలనపై చింతల తీవ్ర విమర్శలు చేశారు. మాటల గారడీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 6 అబద్ధాలు, 66 మోసాలు అన్న రీతిలో నడుస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా మ్యానిఫెస్టోలోని గ్యారెంటీలను అమలు చేయలేదన్నారు, మహిళలకు రూ.2500, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, పింఛన్ల పెంపు తదితర హామీలు ఇచ్చి మోసం చేస్తోందని, ప్రజలంతా నయవంచనకు గురయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశలో ప్రయత్నించకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతారని ఆరోపించారు.

నేడు ఎంజేసీఈటీలో 'హ్యాక్ రెవెల్యూషన్'

హ్యాక్ రెవెల్యూషన్ హ్యాకథాన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంజేసీఈటీ డీన్ ఫర్హతుల్లా హుస్సేనీ

బంజారాహిల్స్,డిసెంబర్ 4: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని వెలికితీసేందుకు మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కంప్యూటర్ కౌన్సిల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఎంజేసీ ఈటీ సంయక్త ఆధ్వర్యంలో గురువారం 'హ్యాక్ రెవెల్యూషన్' పేరుతో హ్యాకథాన్ నిర్వహించనున్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల డీన్ ఫర్హతుల్లా హుస్సేనీ మాట్లాడుతూ.. హ్యాక్ రెవెల్యూషన్ పేరుతో నిర్వహించనున్న 15గంటల హ్యాకథాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్, వేస్ట్ మేనేజ్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్, హెల్త్‌కేర్, హార్డ్‌వేర్ అంశాల్లో విద్యార్థులు తమకు ఇచ్చే ప్రాబ్లమ్స్ పరిష్కరించనున్నారన్నారు.నగరంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యల్లో జట్లు పాల్గొననున్నాయని వివరించారు.

స్వాగతం : ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడు జార్జియోస్ మాట్రికోస్,డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వదేశ్ దేవ్‌రాయ్ నగరానికి విచ్చేసిన సందర్భంగా బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వారికి ఏఐటీయూసీ రాష్ట్ర నేతలు పూల బొకెలను అందించి స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేం పావని,జాతీయ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి పాల్గొన్నారు. - హిమాయత్‌నగర్,డిసెంబర్ 4

ఆహ్వానం: ఈనెల14న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎస్‌పీఆర్ హిల్స్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు రావాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో పాటు జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరమ్ నేతలు బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. - బంజారాహిల్స్,డిసెంబర్ 4

ట్రై సైకిల్స్, వీల్‌చైర్స్ పంపిణీ

ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 98మంది దివ్యాంగులకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్, వీల్‌చైర్స్ తదితర సామగ్రిని బుధవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అందజేశారు. బంజారాహిల్స్‌లోని జీహెచ్ఎంసీ మేనేజర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు ఉపయోగపడే పరికరాల పంపిణీ కార్యక్రమంలో యూసీడీ విభాగం అధికారులు చంద్రశేఖర్, డీఎంసీ ప్రశాంతి పాల్గొన్నారు. - బంజారాహిల్స్, డిసెంబర్ 4

నివాళి: డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఆచార్య జీ.రామిరెడ్డి జయంతి సందర్భంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని వర్సిటీ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొ.ఇ.సుధారాణి, ఈఎంఆర్ఆర్‌సీ డైరెక్టర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్‌తో పాటు బోధన, బోధనేతర సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. - బంజారాహిల్స్

సంగీత రంగానికి ఘంటసాల జీవితం ఆదర్శం

హిమాయత్‌నగర్‌లోని అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో అతిథులకు సత్కారం చేస్తున్న నిర్వాహకులు

హిమాయత్‌నగర్, డిసెంబర్ 4: సంగీత రంగానికి సుప్రసిద్ధ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆదర్శమని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్. ప్రభాకర రావు,కార్యదర్శి మద్దాళి రఘురామ్,సినీ విజ్ఞాన విశారద వ్యాఖ్యాత ఎస్.వి. రామారావు అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 102 జయంతి సందర్భంగా బుధవారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో ఘంటసాల సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘంటసాల వెంకటేశ్వరరావు తన జీవితంలో ఎత్తు పల్లాలు,తీపి చేదు స్మృతులను సమానంగా స్వీకరించారని, తెలుగు పాట ఉన్నంత కాలం అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగు వారి హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. అనంతరం పలువురిని శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గాయకులు డాక్టర్ ఎ.నాగేశ్వరరావు ,టి.శ్రీకాంత్, నిషిజ రమణి,రామలక్ష్మి పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి పడిపూజ: ఆర్బీనగర్ కాలనీకి చెందిన నరేందర్‌గౌడ్ బుధవారం అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. పూజకు శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్పలు పెద్ద సంఖ్యల్లో పాల్గొన్నారు. నరేందర్ గౌడ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.- శంషాబాద్ రూరల్, డిసెంబర్ 4

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

సుమలత (ఫైల్)

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 4 :అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన ఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన సాయిగౌడ్‌కు పదేళ్ల క్రితం మహేశ్వరం మండలం డబిల్‌పూర గ్రామానికి చెందిన సుమలతతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. మంగళవారం రాత్రి సమయంలో భార్య సుమలతకు కడుపు నొప్పి రావడంతో ఆమె స్పృహ కోల్పోయింది. భర్త సాయిగౌడ్ తో పాటు స్థానికులు ఆమెను నిద్రలేపే ప్రయత్నం చేశారు. అప్పటికే మృతి చెందిన్నట్లు చుట్టుపక్కల వారు గుర్తించారు. దీంతో భర్త సాయిగౌడ్ అతడి భార్య కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేయడంతో గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించి అంత్యక్రియలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆమెను స్నానం చేయిస్తుండగా ఆమె ముఖంపై చిన్నచిన్న గాయాలు ఉన్న ట్లు గుర్తించిన సాయి అత్తింటివారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కొంత కాలం నుంచి అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్లు అత్తింటి వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంఈడీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఓయూ పరిధిలోని ఎంఈడీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎండీహెచ్ఎం పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షా ఫీజును ఈ నెల 9 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను నెలలోనే నిర్వహించనున్నటు, పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు డబుల్ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులతో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్,డిసెంబర్ 4: రహ్మత్‌నగర్ డివిజన్ కమలానగర్ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల చిరకాల కల నేడు నెరవేరనున్నట్లు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం లబ్ధిదారులతో సమావేశమై డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు గురువారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

చాచానెహ్రూ నగర్‌లో మొదలైన తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులు

బన్సీలాల్‌పేట్ : చాచా నెహ్రూనగర్‌లోని డబుల్‌బెడ్ రూం ఇండ్ల కాలనీలో నూతన తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులను బుధవారం ప్రారంభించారు. లబ్ధిదారుల కోరిక మేరకు నీటి సరఫరా మెరుగు పరచడానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నిధులను మంజూరు చేశారు. సాంకేతిక ప్రక్రియ పూర్తి అయ్యాక, వాటి పనులను మొదలుపెట్టారు. డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కే లక్ష్మీపతి, నర్సింగ్‌రావు, భీమ్‌రావు, కృష్ణ, రమేశ్, మురళి పనులను పరిశీలించారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే తలసానికి వారు ధన్యవాదములు తెలిపారు.

'అరుణోదయ సభలు జయప్రదం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ : అరుణోదయ 50 వసంతాల సభలను విద్యార్థులు, యువకులు, కవులు, కళాకారులు, మేధావులు, కర్షకులు, కార్మికులు జయప్రదం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సభలను 14, 15 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సభకు సంబంధించిన కరపత్రాలను ఓయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా బుధవారం ఆవిష్కరించారు. ప్రొ. జయధీర్ తిరుమలరావు, విమలక్క మాట్లాడుతూ.. అరుణోదయ పురుడుపోసుకున్న ఇంజినీరింగ్ కళాశాలలో సభ కరపత్రం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కట్టా భగవంతరెడ్డి, మల్సూర్, రమేశ్ పోతుల, అల్లూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

సికింద్రాబాద్ :సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కార్పొరేటర్ హేమ బుధవారం సందర్శించారు. పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పిల్లల మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుంది అని విద్యార్థులను అడిగి కార్పొరేటర్ తెలుసుకున్నారు. విద్యార్థుల ప్లేట్‌లోని భోజనాన్ని రుచి చూశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి.. పిల్లలకు పౌష్టిక ఆహారం అందేలా చూడాలని సూచించా రు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలు వినాలని, లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి, స్టాఫ్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

మధురానగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ మూడో అంతస్తు నిర్మాణ పనులను కార్పొరేటర్ హేమ పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 40 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

పాదయాత్రగా..శబరికి

కాటేదాన్ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి పాదయాత్రగా వెళ్లిన స్వాములు తమిళనాడులోని దుండిగల్‌కు చేరుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన అయ్యప్ప మాల ధరించిన స్వాములు సోమ శ్రీనివాస్‌గుప్తా, మల్లేష్, జగన్, రాజు స్వాము లు 32 రోజులుగా మహా పాదయాత్ర కొనసాగిస్తు బుధవారం తమిళనాడు దుండిగల్‌కు చేరుకొని దేవాలయంలో దర్శనం చేసుకున్నారు. -మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 4:

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బన్సీలాల్‌పేట్ : విద్యార్థులందరూ తమ దృష్టిని విద్యపైనే ఉంచాలని, వీలైనంతవరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రి అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 8,9,10 వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కొత్త పద్ధతుల్లో జరుగుతున్న సైబ ర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టుల వివరాలు చెప్పారు. వాటి బారి న పడకుండా సెక్యూరిటీ పద్ధతులను ఎలా అవలంబించాలో తెలిపారు. సెల్‌ఫోన్‌లో వచ్చే లింక్‌లను తెరిచి, సైబర్ నేరస్తుల వలలో చిక్కి లక్షల రూపాయలు నష్టపోతున్న విధానాలపై ఆమె వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమం లో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబుల్‌రెడ్డినగర్ నర్సాబాయికుంట వద్ద

డ్రైనేజీ సమస్యలు..

చలనం లేని అధికారులు

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోలోని ఓల్డ్ కర్నూల్ రోడ్డు దర్గా సమీపంలో ఉన్న జైదేవ్ ఆసుపత్రి వీధిలో డ్రైనేజీ నీరు నిలిచిపోవడం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బాబుల్‌రెడ్డినగర్‌లోని నర్సాబాయి కుంట ప్రాంతంలో డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఆ మురికి నీటిలోంచే వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి సమస్యలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 4


ఓల్డ్ కర్నూల్ రోడ్డులో రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు